క్లుప్తంగా

నిత్యావసరాల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో పేదలకు కోరమాండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షురాలు గౌరీ పేద మహిళలు, వృద్ధులకు ప్రతి నెలా మారిదిగా నిత్యావసర సరకులు అందించామన్నారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధి కృష్ణమోహన్, కోరమాండల్ మహిళా సంక్షేమ సంఘ కార్యదర్శి మల్లిశ్వరి, కోశాధికారి శ్రీదేవి, సభ్యులు మోహినికుమారి, మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దశావతారం కథామాలిక

బోట్‌క్లబ్: హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక మధురానగర్ గోకులంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు దశావతారం కథామాలిక నిర్వహిస్తున్నట్టు గోకులం అధ్యక్షులు నారాయణం మురళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత హరినామ సంకీర్తన, అనంతరం దశావతార మహిమపై ప్రవచనం ఉంటుందన్నారు.

అండర్-19 ఎస్‌జీఎఫ్‌ఐ షెడ్యూల్‌లో మార్పులు

22న జరగాల్సిన ఎంపికలు 19కి మార్పు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-19 ఆధ్వర్యంలో ఈ నెల 22న జరగాల్సిన వివిధ క్రీడా ఎంపికలు ఈ నెల 19కి మార్పు చేసినట్టు క్రీడాసమాఖ్య కార్యదర్శి వెంకటరెడ్డి శనివారం తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల తేదీలు ప్రకటించడంతో ఈ మార్పు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 19న డీఎస్‌ఏ కాకినాడలో సైక్లింగ్, మోడ్రన్‌పెంటాథలాన్, ఎన్టీఆర్ బీచ్ కాకినాడలో బీచ్ వాలీబాల్, రాజా ట్యాంక్‌లో స్కేటింగ్, కోనసీమ రాజోలులో ఫెన్సింగ్, జి.మామిడాడ ఫ్యామిలీ క్లబ్‌లో టేబుల్‌టెన్నిస్, పిఠాపురంలో ఆర్చరీ ఎంపికలు జరుగుతాయన్నారు. ఈ ఎంపికలు సీనియర్ పీడీలు రత్నశామ్యూల్, శివరామకృష్ణ పర్యవేక్షణలో నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు సంబంధిత ఎంపిక పత్రాలతో హాజరు కావాలని వెంకటరెడ్డి కోరారు.

నేడు జూనియర్ అథ్లెటిక్స్ మీట్ ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు ఆదివారం క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్టు సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు. అండర్-14, 16,18 అండర్-20 విభాగాల్లో బాలబాలికల ఎంపికలు ఏపీఎస్పీ పోలీస్ గ్రౌండ్స్ క్రీడామైదానంలో జరుగుతాయన్నారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని తెలిపారు. ఎంపికలు సంఘ అధ్యక్షుడు టీవీఎస్ రంగారావు, ట్రెజరర్ వర్మ పర్యవేక్షణలో జరుగతాయన్నారు.

మరిడమ్మ జాతర మహోత్సవాలు



సీతారామపురంలో మరిడమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామ దేవత మరిడమ్మ వారి జాతర మహోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు కందికొండ వెంకటకృష్ణయ్య, భాస్కరశర్మ, రవి తదితరుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి శాంతిహోమం జరిపారు. ఇందులో భాగంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, పంచామృతాభిషేకం తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు ఆకట్టుకున్నాయి.

ఉప్పాడ తీరప్రాంతం పరిశీలన



ఉప్పాడ తీరప్రాంతాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ మనీషా

కొత్తపల్లి: ఉప్పాడ తీరప్రాంతం, కోతకు గురవుతున్న బీచ్‌రోడ్డును శనివారం అధికారులతో కలిసి ట్రైనీ కలెక్టర్ మనీషా పరిశీలించారు. మత్స్యకారులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మనీషా మాట్లాడుతూ సముద్ర అలల ఉధృతి కారణంగా కెరటాలు రోడ్డును దాటి తీరప్రాంత గ్రామాలైన సుబ్బంపేట, రంగంపేట, కొత్తపట్నంలోకి వస్తున్నాయి. గత మూడు రోజుల నుంచి నీరు నిలిచిపోవడంతో ఆ నీటిని మోటార్లతో తోడిస్తున్నారు. తీరప్రాంత శాశ్వత రక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. బీచ్‌రోడ్డు ప్రమాదకరంగా ఉందని రోడ్డుపై రాకపోకలు నిలిపివేయాలని అధికారులకు కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారాన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మల్లిబాబు, తహసీల్దారు చిన్నారావు తదితరులు ఉన్నారు.

మురుగునీరిలా.. వెళ్లేదెలా..

- నగరంలో పారిశుధ్య వ్యవస్థ అధ్వానం
- భరించలేకపోతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

బోట్‌క్లబ్: నగరంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఏ వీధి చూసినా చెత్తాచెదారంతో దర్శనమిస్తోంది. డ్రైన్లు మురుగునీటితో నిండిపోయి కనిపిస్తున్నాయి. ప్రజలు నిత్యం దుర్వాసన మధ్య జీవనం సాగిస్తున్నారు. డ్రైనేజీలు పొంగి పొర్లిపోతున్న పట్టించుకునే నాథులే కరువయ్యారు. రెండు నెలల కావస్తున్న డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త తరలించడంలేదు. కాకినాడ నగరపాలక సంస్థకు పాలకవర్గం లేకపోవడంతో పారిశుధ్య సిబ్బంది తమ ఇష్టానుసారంగా విధులకు హాజరు కావడంతో పలు ప్రాంతాల్లోలో డ్రైనేజీలు దారుణంగా తయారైపోయాయి. పాలకవర్గం ఉంటే కౌన్సిల్ సమావేశంలో తమ ప్రాంతంలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళితే వెంటనే వాటికి పరిష్కారం లభించేది. కాకినాడ నగరపాలక సంస్థ పాలకవర్గం ఎన్నికల జరగకపోవడంతో ప్రస్తుతం పారిశుధ్య సిబ్బంది తమ విధులు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు.

అధ్వానంగా కచేరి పేట

జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న వీధి కచేరి పేట అక్కడ ప్రస్తుతం డ్రైనేజీలు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. డ్రైనేజీలో పేరుకుపోయిన సిల్టు గత రెండు నెలలుగా తీయకపోవడంతో మురుగునీరు బయటకు పోయే అవకాశం లేకుండా పోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు సైతం మురుగునీరు పోయేందుకు వీలు లేక రహదారుల పైనే వర్షపు నీరు నిల్వ ఉండిపోయింది. దీంతో ఈ మురుగు నీటిలోనే ఈ ప్రాంత ప్రజలు నిత్యం ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం వర్షం లేకపోయినా ఇంటిలోని మురుగనీరు డ్రైనేజీల్లో నుంచి రోడ్లపైకి వస్తోంది. అయినప్పటికీ సిబ్బంది ఈ వీధుల వైపు తొంగి చూడడం లేదు. దీంతో ఈ ప్రాంత ప్రజలు దోమలతో నిత్య అవస్థలు పడుతున్నారు. చీకటి పడితే గుంపులుగా దోమలు ఇళ్లల్లో చేరుతున్నాయని దీంతో నిద్రలేని రాత్రులు గడపాల్సిన పరిస్థితి నెలకొందని ఈ ప్రాంత మహిళలు వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులకు ఫోన్లో ఈ ప్రాంత సమస్యలు విన్నవించుకున్న వారు పెడచెవిన పెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కచేరిపేటలోని ఒకవీధిలో డ్రైనేజీ ఆక్రమించుకొని ఒక వ్యక్తి నిర్మాణం చేస్తున్న కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలు కారణంగా డ్రైనేజీలో మురుగునీరు ప్రవహించడం లేదు.



కచేరిపేటలో ఒక వీధిలో డ్రైనేజీ ఆక్రమించి నిర్మాణాలు



కచేరిపేటలో డ్రైనేజీ నిండిపోయి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

దోమల వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలేవి

గతంలో దోమల వృద్ధి చెందకుండా కార్పొరేషన్ అధికారులు ఫాగింగ్ యంత్రాల ద్వారా కనీసం వారంలో ఒక్క రోజైనా డ్రైనేజీల వద్ద ఫాగింగ్ చేసే వారు రాత్రి సమయాల్లో పాగింగ్ చేయడం వల్ల దోమలు అదుపులో ఉండేవి. ప్రస్తుతం ఫాగింగ్ యంత్రాలు కనీసం వీధుల్లో కూడా రావడం లేదని అసలు ఫాగింగ్ యంత్రాలు ఉన్నాయో లేదో తెలియడం లేదని స్థానికులు మండి పడుతున్నారు.

పారిశుధ్య సిబ్బందిపై కొరవడినా పర్యవేక్షణ

కాకినాడ నగరంలో సుమారు వెయ్యి మందికిపైగా రెగ్యులర్, కాంట్రాక్టు పద్ధతిపై పని చేసే పారిశుధ్య సిబ్బంది ఉన్నారు. ప్రతిరోజు వారు నగరంలో వారికి కేటాయించిన వీధుల్లో రోడ్లు శుభ్రం చేయడం, డ్రైనేజీల్లో పేరుకొనిపోయిన చెత్తా చెదారం, సిల్ట్ తీయాల్సి ఉంది. కార్పొరేషన్ పాలక వర్గం ఉంటే ఆ డివిజన్ కార్పొరేటర్ ప్రతిరోజు సిబ్బంది ఎలా పనిచేస్తున్నారో తనిఖీ చేసేవారు. ప్రస్తుతం పాలక వర్గం లేకపోవడంతో సిబ్బంది తూతూ మంత్రంగానే విధులకు హాజరవుతున్నారే విమర్శలు వస్తున్నాయి. సిబ్బంది సక్రమంగా విధులు రాకుండా మస్తర్లు వేసుకొంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కార్పొరేషన్ ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజు విధులకు హాజరయ్యే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్గంధం భరించలేకున్నాం



డ్రైనేజీలు నుంచి వస్తున్న దుర్వాసనతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. గత రెండు నెలలుగా ఈ ప్రాంతంలో డ్రైనేజీలు శుభ్రం చేయలేదు. దీంతో కొంపు కొడుతున్నా ముక్కు మూసుకొని ఈ రహదారులపై ప్రయాణించాల్సి వస్తోంది.

– కె.వీరబాబు, స్థానికుడు

దోమలతో ఇబ్బంది



మా కచేరిపేటలో రాత్రి సమయంలో దోమలతో చాలా ఇబ్బంది పెడుతున్నాం. కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఏదొక పని మీద తలుపులు తెరిస్తే చాలు దోమలు గుంపులుగా లోపలకు వస్తున్నాయి. ఆలౌవుట్ వినియోగిస్తున్నా పెద్ద ఉపయోగం ఉండడంలేదు. అధికారులు దోమల వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలి.

– వి.శ్రీరామ్ విపిన్‌కుమార్, స్థానికుడు

జమ్మలమడక నాగమణికి అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేత జమ్మలమడక నాగమణి

కాకినాడ రూరల్: గ్లోబల్ హెల్పింగ్ ఆర్మీ ఫౌండేషన్ ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణికి ఇన్స్పిరేషన్ అవార్డును అందుకున్నారు. సంస్థ వ్యవస్థాపకుడు పలివెల స్వరూప్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అనంతరం ఆమె సేవలను పలువురు కొనియాడారు. నాగమణి మాట్లాడుతూ గ్లోబల్ హెల్పింగ్ ఆర్మీ ఫౌండేషన్‌కు తాను గౌరవ అధ్యక్షురాలుగా ఉన్నానని, సేవా కార్యక్రమాలకు గాను గుర్తించి పురస్కారం అందించారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రియాంక, సుధారాణి, వాసన్ కంటి వైద్య సిబ్బంది, హాసిని డెంటల్ క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడలో రేపు సంగీత విభావరి

బోట్‌క్లబ్: ప్రముఖ న్యాయవాది మాదిరెడ్డి సుబ్బారావు జయంతి సందర్భంగా సోమవారం సాయంత్రం 6 గంటలకు స్థానిక ఐటీఐ పక్కన ఉన్న గ్రౌండ్‌లో సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ గాయని కల్పన, రాము, పీవీ రమణ ఆధ్వర్యంలో ఈ సంగీత విభావరి జరుగుతుందన్నారు. కళాభిమానులు అందరూ పాల్గొనాలని కోరారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు



విద్యార్థులకు సీపీఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

బోట్‌క్లబ్: గుండెపోటు వచ్చిన మనిషికి సీపీఆర్ చేస్తే అతని ప్రాణం కాపాడవచ్చని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల్లో శనివారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒక వ్యక్తి శ్వాస తీసుకోవడం, హృదయ స్పందన ఆగిపోయినప్పుడు చేసే అత్యవసర చికిత్సను సీపీఆర్ అంటారన్నారు. నిమిషానికి 100 నుంచి 120 సార్లు ఛాతీ మధ్యలో గట్టిగా, వేగంగా నొక్కుతూ వైద్య సహాయం వచ్చే వరకు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, కళాశాల డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు పాల్గొన్నారు.

17 నుంచి స్వస్థ నారీ-శక్తివంతమైన కుటుంబం అభియాన్

కాకినాడ క్రైం: ఈనెల 17వ తేదీ నుంచి స్వస్థ నారీ-శక్తివంతమైన కుటుంబం అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళా సాధికారితే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 491 ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ శిబిరాల్లో పిల్లలు, మహిళలకు ప్రత్యేక ఆరోగ్య సేవలు అందిస్తామని తెలిపారు. ఆరోగ్యశ్రీ ఎంపానెల్డ్ ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఫాగ్సీ వైద్యుల సంయుక్త భాగస్వామ్యంతో జరగనుంది. అక్టోబర్ 2వ తేదీ వరకూ జరగనున్న ఈ కార్యక్రమానికి డాక్టర్ వి.అరుణ ప్రోగ్రాం ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.

అన్నదానాలు

బోట్‌క్లబ్: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక గాంధీనగర్ పూళ్లవారివీధిలో శనివారం భారీ అన్నదానం నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కోడిగుడ్డు సత్యనారాయణ బృందం ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి, బీజేపీ నాయకులు మాలకొండయ్య, దువ్వూరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అచ్చంపేట జంక్షన్ వద్ద...

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామ పరిధిలో అచ్చంపేట జంక్షన్ వద్ద లక్ష్మీగణపతి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం భారీ అన్న సంతర్పణ జరిగింది. గ్రామ సర్పంచ్ బి.సత్యనారాయణ, ఆటో యూనియన్ నాయకుడు వై.రాజా తదితరులు కార్యక్రమంలో పాల్గొని వడ్డన చేశారు. ఏడీబీ రోడ్డు, పిఠాపురం-కాకినాడ మధ్య ప్రయాణాలు చేసే వారు, తిమ్మాపురం, అచ్చంపేట, రమణయ్యపేట తదితర గ్రామాల నుంచి ప్రజలు వచ్చి పెద్ద ఎత్తున అన్న ప్రసాదం స్వీకరించారు.



అన్న సంతర్పణలో వడ్డన చేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ తదితరులు

అండర్-17 గట్కా జట్టు ఇదే



గట్కా విభాగంలో ఎంపికైన క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో ఈ నెల 11న కాకినాడ డీఎస్‌ఏలో నిర్వహించిన గట్కా పోటీల్లో ఎంపికైన క్రీడాకారుల వివరాలు శనివారం సమాఖ్య కార్యదర్శి కె.శ్రీనివాసరావు వెల్లడించారు. బాలుర విభాగంలో యూపీవీఎస్ శ్రీకృష్ణ, పీవీ మధు, బీ హర్షసాయి, వి.చంద్రశేఖర్, ఏ రిషికుమార్, సీహెచ్ డీ మహిధర్, జి.ఆరోన్‌కుమార్, కె.లికిష్, కె.వర్షిత్, ఎస్ఎన్ సాయి నికేష్ ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను సమాఖ్య బాలికల కార్యదర్శి సుధారాణి, సీనియర్ పీడీలు రవిరాజు, బచ్చు చంద్రశేఖర్, మాచరరావు, పట్టాభి అభినందించారు.

చేబ్రోలు సొసైటీలో డీసీఓ విచారణ

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి వచ్చిన యూరియాను తీసుకునేందుకు రైతులు శనివారం తెల్లవారు జామునే వచ్చారు. సొసైటీ సిబ్బందికి రైతులు ఆధార్ కార్డులు ఇస్తుండగా కొంతమంది వాటిని విసిరి కొట్టడంతో చెల్లాచెదురుగా పడిపోయాయి. ఇంతలో ఓ టీడీపీ నాయకుడు పిఠాపురం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చేతిలో ఉన్న టోకెన్లను లాక్కొని తనకు చెందిన రైతులకు అందజేశాడు. దీనిపై మిగిలిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. దీనిపై డీసీసీబీ డీసీఓ శ్రీనివాసరెడ్డి విచారణ చేపట్టారు. రైతుల ఆందోళన, వైఎస్సార్ సీపీ నాయకుల ధర్నా మేరకు సమాచారం అందుకున్న ఆయన సొసైటీకు చేరుకుని వివరాలు సేకరించారు. పిఠాపురం ఏడీఏ స్వాతి, మండల వ్యవసాయ శాఖాధికారి సత్యనారాయణ, సొసైటీ కార్యదర్శి ఈశ్వరరావు నుంచి వివరాలు సేకరించారు. తమ వద్ద నుంచి టీడీపీకు చెందిన ఒక నాయకుడు యూరియా టోకెన్లు లాక్కొని రైతులకు పంచిపెట్టాడని ఏడీఏ తెలిపారు. తాము ఇవ్వొద్దు అని చెప్పినా వినిపించుకోలేదన్నారు. చేసేది లేక మేము బయటకు వెళ్లిపోయామని ఏడీఏ తెలిపారు. సొసైటీ సిబ్బంది ఇష్టానుసారంగా టోకెన్లు జారీ చేశారని తెలిపారు. దీనికి సంబంధించిన ఫొటోలను డీసీఓకు ఆమె చూపించారు. దీనిపై వెంటనే సొసైటీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు డీసీఓను కోరారు. సొసైటీ కార్యదర్శి, సిబ్బంది లేకుండా టోకెన్ ఎలా జారీ చేశారని ప్రశ్నించారు. యూరియాను బ్లాక్ మార్కెట్ తరలించేందుకు ఇదొక పన్నాగమని తెలిపారు. తక్షణం బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై స్పందించిన డీసీఓ శ్రీనివాసరెడ్డి బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు అందరికీ యూరియా ఇచ్చేలా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ పెర్సన్ ఇన్‌చార్జి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



టోకెన్ల పంపిణీపై విచారణ నిర్వహిస్తున్న అధికారులు. చిత్రంలో జెడ్పీటీసీ వులవకాయల లోవరాజు

ఈ-సేవలకు స్వస్తి!

- ఆర్‌బీకేల్లో మూలకు చేరిన కియోస్క్‌లు
- గతంలో రైతులకు మెరుగైన సేవలు
- పట్టించుకోని కూటమి నాయకులు

పెద్దాపురం: విత్తనం నాటే దగ్గర నుంచి పంట విక్రయం వరకు అన్నదాతకు అండగా ఉండాలనే ఆశయంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలను (ఇప్పుడు రైతు సేవా కేంద్రాలు) ఏర్పాటు చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల ముందులు ఏవి అవసరమైన రైతులు ఆర్‌బీకే వద్దకు వచ్చి తీసుకువెళ్లేవారు. అక్కడి సిబ్బందికి ముందుగు నగదు చెల్లించి వారికి కావాల్సిన ఎరువులను తెచ్చుకునేవారు. సిబ్బంది కూడా రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించేవారు. కియోస్క్ యంత్రాల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే అ తరువాత ఏ రైతుకు ఏ రకం కావాలన్న వెంటనే పంపిణీ చేసే పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్‌బీకేలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చారే తప్పా రైతులకు అందించాల్సిన సేవలు మాత్రం గాలికొదిలేశారు. దీంతో కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా మార్చేశారు. ప్రస్తుతం ఆయా రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ సేవలు లేనందున కియోస్క్ యంత్రాలు మూలనపడ్డాయి.



ఆర్‌బీకేల్లో కియోస్క్ యంత్రాలను ప్రారంభిస్తున్న కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు (ఫైల్)

అప్పట్లో ఎన్నో సేవలు

నియోజకవర్గ పరిధిలోని సామర్లకోట, పెద్దాపురం మండలాల్లో ఆయా గ్రామాల్లోనూ ఒక్కో ఆర్‌బీకే ఏర్పాటు చేసి 44 కియోస్క్ యంత్రాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఆయా కియోస్క్ యంత్రాల ద్వారా మెరుగైన సేవలందించారు. ఈ కేంద్రాల్లో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు సేవలందించేందుకు లక్షల రూపాయలు వెచ్చించి వీటిని కొనుగోలు చేశారు. ఈ యంత్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, వ్యవసాయ యంత్రాలు, రైతులు పంటలను ఉత్పత్తి చేసేటప్పుడు ఉన్న మార్కెట్ ధరలు, దగ్గరలో ఉన్న మార్కెట్ వివరాలను ఈ డిజిటల్ కియోస్క్ యంత్రం ద్వారా తెలుసుకునే వీలుండేది. కచ్చితమైన సమాచారం, ఫలితాలతో రైతులకు వ్యవసాయ శాఖ అన్ని విధాల సేవలందించింది. వాతావరణంలో మార్పులు, ఏ సమయంలో ఏ పంటలు వేయాలనే సమాచారాన్ని దీన్నిలో పొందుపర్చారు. నాడు ఎంతోమంది రైతులకు మేలు చేకూర్చిన కియోస్క్ యంత్రాలు ప్రస్తుతం మూలకు చేరడంతో ప్రభుత్వ వైఫల్యం కట్టొచ్చినట్టు తెలుస్తోంది.



ప్రస్తుతం ఆర్‌బీకేల్లో వినియోగం లేకుండా మూలకు చేరిన కియోస్క్

మొక్కుబడి సేవలు

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో లక్షలు విలువ చేసే కియోస్క్ యంత్రాల వినియోగంపై నిర్లక్ష్యం వహించడంతో ప్రజాధనం వృథా అవడంతో పాటు రైతులకు సరైన సమయంలో సాయం అందడంలేదు. దీనివల్ల రైతులు ఎరువుల కోసం ప్రైవేట్ డీలర్లను సంప్రదించాల్సి వస్తోంది. అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. కియోస్క్ యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు మెరుగైన సేవలందించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

డిజిటల్ సేవలు అవసరం



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకేల్లో కియోస్క్ యంత్రాల ద్వారా అవసరమైన ఎరువులు, విత్తనాలు అందించేవారు. రైతులకు అవసరమైన అన్ని సేవలు డిజిటల్ ద్వారా తెలియజేసేవారు. ఇప్పుడు కూడా రైతులకు డిజిటల్ సేవలు అవసరమే. అధికారులు వాటిని అందుబాటులోకి తీసుకొస్తే బాగుంటుంది.

– నాగబోయిన రాజుబాబు, పవర, సామర్లకోట మండలం

అధిక ధరలకు కొంటున్నాం



ఈ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందించలేకపోయింది. మా మండలంలో ఏ ఆర్‌బీకేల్లోనూ కియోస్క్ యంత్రాలను వాడడం లేదు. యూరియా ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు కొంటున్నాం. గతంలో మాదిరిగా అన్ని సేవలందించేలా పూర్తి చర్యలు చేపట్టాలి.

– సుందరెడ్డి రాజు, కౌలు రైతు, పులిమేరు, పెద్దాపురం మండలం

సమస్యలు పరిష్కరిస్తాం



రైతు సేవా కేంద్రంలో కియోస్క్ యంత్రాలు వినియోగంలోనే ఉన్నాయి. కొన్నిచోట్లు సాంకేతిక లోపంతో నిలిచిపోయాయి. అవి సత్వరమే పని చేసేలా చర్యలు తీసుకుంటాం. రైతుల సౌలభ్యం కోసం మొబైల్ యాప్ ద్వారా సేవలందిస్తున్నాం. సమస్య ఉంటే గుర్తించి పరిష్కరిస్తాం.

– కె.సంజయ్‌కుమార్, వ్యవసాయ శాఖాధికారి, పెద్దాపురం

శ్రీవారి జపయజ్ఞ పారాయణ



పీఠంలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేట దూసర్లపూడి వారి వీధిలోని స్వయంభూ భోగి గణపతి పీఠంలో వేంకటేశ్వరస్వామి 105వ జపయజ్ఞ పారాయణ శనివారం వైభవంగా నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ భోగి గణపతికి 16వ వార్షికంలో చేపట్టిన కాంస్య కవచ యజ్ఞం తిరుమల పాదయాత్రతో పూర్తయిన నాటి నుంచి గత రెండేళ్లుగా ప్రతి శనివారం శ్రీవారి పాదాల వద్ద 108 జపయజ్ఞాలు జరుగుతున్నాయన్నారు. అక్టోబర్ 5న తిరుమల బస్సు యాత్ర, 10న రాత్రి కోల సంబరం, 11న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణం, భారీ అన్నసంతర్పణ జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమాజం సభ్యులు మల్లిక లక్ష్మీ, నాగమణి, దేవి, పద్మ, రాధ, మంగతాయారు, కుమారి పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

కరప: వేములవాడ గ్రామ శివారు సిరిగలపల్లిలంక గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందేలపై శనివారం దాడి చేసి 12 మందిని కరప పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.21,200 నగదు, నాలుగు కోడిపుంజులు, నాలుగు కోడి కత్తులు సీజు చేశారు. వారిపై కరప ఎస్సై టి.సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేయుచున్నారు.

45 మంది జూదరులకు జరిమానా

గండేపల్లి/జగ్గంపేట: గండేపల్లి, జగ్గంపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో 45 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్టు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. వీరిని పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.300 చొప్పున రూ.13,500 జరిమాన విధించినట్టు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా జూదాలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.